# గవ్యం

ఎండ నెత్తిమాడ్చేస్తూంది! గాలి ఆడని ఉక్క! చెమట, చీదర, ఝాం అనే ఈగలు, కంటిమీద ముసిరే దోమలు! ఉమ్ములు, ఉప్పులు, కారా కిళ్ళీ మరకలు, అరటి పండ్లు తొక్కలు, మామిడి పళ్ళ టెంకలు, పనస పిక్కలు.... నానా గలీజు అక్కడే వుంది. హడావిడిగా తిరిగే పందులు, తీరు బాటుగా అడ్డంగా నిల్చుని నెమరువేసే ఆంబోతులు, కొంప మునిగినట్లు కొట్లాడుకునే ఊరకుక్కలు, లారీల మోత, బస్సుల హారన్లు, పాన్‌బీడా గరమ్ చాయ్‌ల కేకలు....

బస్ స్టాండ్ అంతా ఒకటే గోల! ఒకటే చీదర! ప్రపంచంలో ఉన్న కుళ్ళంతా అక్కడే పోగుపడిందా అన్నంత గలీజుగా వుంది అక్కడ.

నరకం అంటూ వేరే ఎక్కడుంటుంది! అనుకున్నాడు వెంకట్రావు. పదోసారి వాచి చూసుకున్నాడు ఎంతకూరాని బస్సు మీద పదహారో సారి. వెధవరైళ్ళు, బస్సులు తిన్నగా వేళకి వస్తే ఆశ్చర్యంగానీ రాకపోతే వింత ఏముంది అని విసుక్కున్నాడు. మరోసారి రుమాలుతో చెమట తుడుచుకుని మొహాన ముసిరే దోమల్ని తోలుకున్నాడు. విశాఖపట్నంనించి రావాలి బస్సు! అదసలు ఇంకా అక్కడ బయలు దేరిందో లేదో ఎవరికి తెలియదు!

మల మల మాడ్చే ఎండ బారినించి తప్పించుకోడానికైనా అక్కడున్న పాక టీ హోటల్లో దూరక తప్పలేదు వెంకట్రావుకి. ఊరికే కూర్చుంటే బాగుండదని "టీ" ఆర్డరు చేశాడు.

బస్సులు వస్తున్నాయి, వెడుతున్నాయి .... అతనికి కావల్సింది మాత్రం రాదు!... లారీ డ్రైవర్లు బస్సు డ్రైవర్లు, క్లీనర్లు టీ త్రాగుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు సావకాశంగా.

"ఎన్టి ఓడు మాగొప్పగా ఏక్టు సేసిండు. నేను మూడు మాట్లు సూశాను... అబ్బ జయ లలిత... తస్సదియ్య.... మా గుమ్మగా వుంది గురూ!..." ఏదో సినిమా గురించి చెప్పుకునే వాళ్ళ మాటలు వింటూంటే వాళ్ళ అభిరుచికి అభినందించాలా .... ఆనందించాలా అని ఆలోచిస్తూ పరధ్యానంగా కూర్చున్నాడు.

ఎదురుగా సెగలు కక్కుతున్న వేడి నీళ్ళు త్రాగాలా వద్దా అనిపించి, ఇరవై పైసలు నష్టం చేసేముందు, పోనీ ఓసారి రుచి చూస్తేనో అనిపించి నోటిదగ్గర కప్పు పెట్టుకున్నాడు. నాలుక చురుక్కుమంది. ఆ వాసనకి కడుపులో త్రిప్పి అదలా వదిలేశాడు.

"ఏరా, దొంగనాయలా, లారీకి లోడేసుకోవాలి, ఎప్పుడురా నీవు బండి క్లీన్ సేస్తివు...." ఎవడో కాకిబట్టల్లో డ్రైవరో క్లీనరోగాని ఓ పదేళ్ళ కుర్రాడు లోపలికి రాగానే చూసి కేకలేశాడు.

"సిటికెలో సేసేస్తాను క్లీనరు బాబూ ..." నాన్నాడు ఆకుర్రాడు.... మోకాలు దిగువదాకా వ్రేలాడే కాకీనిక్కరు, ఏ రంగో తెలియనంత మాసిపోయి, బుజాలు దగ్గిర పిగిలిపోయిన పెద్ద షర్టుతో, చేతిలో చిన్న బాల్చి గుమ్మందగ్గిర పెట్టి లోపలి కెళ్ళాడు ఆ కుర్రాడు.

"బేగే కానీరా యీరిగా, లోడేసుకుని రాజమండ్రి ఎళ్లి రాత్రికి తిరిగి రావాలి ..." ఇందాకటి క్లీనరు తొందర పెట్టాడు. సత్తుగ్లాసులో టీ పోయించుకుని ఊదుకుంటూ గబ గబ టీ త్రాగుతున్నాడు ఆ కుర్రాడు.

"ఓరేయ్ యీరిగా.... యీరిగా....ఎక్కడ సచ్చావు...." అరుచు

కుంటూ ఓ మనిషి లోపలికి వచ్చాడు. వాడిని చూసి యీరిగాడు గబుక్కున స్తంభం చాటున నక్కాడు. కాని అప్పటికే యీరిగాడిని వాడు చూడనే చూశాడు. అటువైపు గబ గబ వెళ్ళాడు.

"దొంగ ఎదవా, దాంకుంటావురా .... పిలిస్తే గవురోజనమా, పలకవురా నచ్చు యెదవా" నోటికొచ్చినట్లు తిట్టూ వీరిగాడి చొక్కా పట్టుకున్నాడు వీరిగాడు నిస్సహాయంగా బెదురు చూపులు చూశాడు. బెదురుతో పాటు తిరస్కారమూ వుంది ఆ చూపులో .... ఆ వచ్చినవాడు చొరవగా వీరిగాడి నిక్కరు జేబులో చెయ్యి పెట్టాడు వీరిగాడు జేబుని గట్టిగా పట్టుకున్నాడు.

"తీరా, డబ్బులు తీ...." అన్నాడు ఆథార్టీగా, వీరిగాడి చెయ్యి లాగేస్తూ.

"నాకాడ డబ్బులు నేవు...." ఏడుపు గొంతుతో అన్నాడు వీరిగాడు.

"ఎదవా, దొంగ ఎదవా....డబ్బులేన్నేవూ నీవు నిజం ఎప్పుడు సెప్పావు, దొంగతొత్తు కొడకా...." బలవంతంగా జేబులో చెయ్యి పెట్టి గుప్పెడు చిల్లర డబ్బులు తీసాడు ఆ మనిషి. వీరిగాడి మొహం నల్లబడింది. అవతల వాడి మొహం సంతోషంతో వెలిగింది. ఆనందంగా చిల్లర లెక్కపెట్టుకుంటున్నాడు. వీరిగాడు బితుకు బితుకుమని చూశాడు. లేని ధైర్యం తెచ్చుకొని...." ఆ డబ్బు లిచ్చేయి. యింటికాడ బియ్యం లేవు... కొనాలి" అన్నాడు.

"పోరా, ఎదవా !" అప్పటికే వాడు జేబులో డబ్బులు వేసేసుకుని నిర్లక్ష్యంగా తలెగరేశాడు వీరిగాడిని అవతలకి నెట్టేస్తూ.

టీ త్రాగుతున్న డ్రైవర్లు వీరిగాడ్ని జాలిగా చూశారు. "నర్సిగా,

ఎందుకురా ఆ గుంటెదవని అలా ఏడిపిస్తావు....ఆడు కష్టపడి దాచుకు డబ్బులుకూడా పట్టికెళ్ళి తాగుడు కెట్టేస్తే యింటికాడ పెళ్ళాం పిల్లలు ఎలా బ్రతుకుతారు....నీకీ పాడు బుద్ధి ఎప్పుడు పోతాదిరా...." అందులో ఒకడు కాస్త గట్టిగా మందలించ బోయాడు.

"నా వూసు నీ కెందుకు...ఆడు నా కొడుకు...నేనాడి బాబుని మధ్య నీకేటి?..." నర్సిగాడు అంతకంటె గట్టిగా జవాబు చెప్పి, కొద్దిగా జవాబు చెప్పి కొద్దిగా తూలుకుంటూ వెళ్ళిపోయాడు. డబ్బులు దొరికిన సంతోషంలో గాబోలు యీల పాట జోరుగా వుంది.

నర్సిగాడి వంక వీరిగాడు చూస్తున్న చూపులకే శక్తి వుంటే ఆ పళంగా తండ్రిని అక్కడే నిలువునా భస్మంచేసేటంత తీవ్రంగా వున్నాయి. కళ్ళలోంచి జారి పడిపోతున్న అశ్రువులు ముంజేత్తో తుడుచుకున్నాడు.

"యీరిగా ఎన్నిమార్లు చెప్పినా నీ కాడ డబ్బు లెందు కుంచు కుంటువురా. ఏడన్న దాచుకోమన్నానా....ఆ దొంగ సచ్చినోడు డబ్బు లగ పడితె ఊరుకుంటాడా" ఓ డ్రైవరు జాలిగా ఓదార్చాడు.

ఆ డిప్పుడొస్తాడనుకోలేదు... యింటికాడ నూకలు లేవు. మాయమ్మ యిప్పుడొచ్చి అట్టి గెళతానంది...." యీరిగాడు ఏడ్పు మధ్య అన్నాడు.

జరిగిన బాగోతం అంతా కుతూహలంగా చూస్తున్న వెంకట్రావుకి సగం కథ అర్థం అయింది. నర్సిగాడు తండ్రి! యీరిగాడు కొడుకు. నర్సిగాడు త్రాగుబోతు. వాడు సంపాదించిందే కాక కొడుకు కష్టపడి సంపాదించింది కూడా జబర్దస్తీగా లాక్కుని త్రాగుడికి తగ లేస్తాడన్న మాట. వీరిగాడ్ని చూస్తుంటే వాడి సంగతేమిటో తెలుసుకోవాలన్న బుద్ధి పుట్టింది వెంకట్రావుకి.

"ఎవరు వాడు? యీ కుర్రాడి దగ్గిర డబ్బు అలా లాక్కెళ్ళి పోయాడు ఎందుకు?" ఓ డ్రైవర్ని అడిగాడు.

"ఆడినాపే ఆడు... దొంగ యదవ, త్రాగుబోతు సచ్చినోడు.... నాడు రిచ్చా లాగిన డబ్బంతా త్రాగుడుకి, మూడు ముక్కలాటకీ ఎట్టే స్తాడు.... అది సాలక యీ గుంటడు సంపాదించినది కూడా లాక్కెళ్ళి పోతాడు. యింటికాడ, పెళ్ళాం నలుగురు పిల్లలు తిండిలేక మాడి సచ్చినా వాడి కక్కరలేదు... యీ గుంటడే యింటికిదిక్కు, అల్లమ్మ ఎక్కడో పాసి పని చేసి ఓ పది రూపాయలు తెస్తుంది.... వీడు లారీలు బస్సులు తుడచి హోటల్లో పనిచేసి రోజుకొక రూపాయో అర్ధో తెస్తే అది కూడా అప్పుడప్పుడు లాకెళ్ళి పోతాడు ఆడు.... ...."

తరువాత డ్రైవరు చెప్పిందంతా వింటూంటే వెంకట్రావుకి ఎంతో ఆశ్చర్యంవేసింది. పట్టుమని పదేళ్ళులేని వీరిగాడి కార్యదక్షత, దీక్ష వింటే ముచ్చటేసింది. తండ్రి తాగుబోతు, పెళ్ళాం పిల్లలు ఎలా బ్రతుకుతారన్నది వాడి కక్కరలేదు. తల్లిని నలుగురు చెల్లెళ్ళని, తమ్ముళ్ళని పోషణభారం పదేళ్ళ లేని వీరిగాడు తన మీద వేసుకున్నాడు. తండ్రి అంటే ఎంత విప రీతమైన ద్వేషమో, తల్లి అంటే అంత ప్రేమాభిమానాలున్నాయి వాడికి. చావు దెబ్బలు కొట్టే తండ్రి బారినుంచి తల్లిని ఎలా రక్షించడమో వాడి వయసుకి తెలియకపోయినా తల్లి కేలోటు రాకుండా వాడీడుకి మించి కష్టపడి తల్లిని, తోబుట్టువులని సుఖపెడుతున్నాడు.

ప్రొద్దుటే లేచి యీ హోటలు శుభ్రంగా తుడిచి కళ్ళాపిజల్లినందుకు ప్రతిఫలంగా టీ ఫలహారాలు ముట్టుతాయి వాడికి రెండుపూట్లా. బస్‌స్టాండ్‌లో లారీలు, బస్సులు కడిగి తుడిచే పని క్లీనర్ల దయ వల్ల సంపాయించుకున్నాడు. క్లీనర్ల బద్ధకం కొద్దీ పావలా, అర్ధా వీరిగాడి చేతులో పెట్టి బండి కడిగిస్తారు. రాత్రయినా కిరసనాయలు బుడ్డి సహాయంతో లారీలు అవీ తుడుస్తాడు. అలా సంపాయించింది రోజుకి కనీసం రెండు రూపాయలుంటుంది. అందులో సగం తల్లి కిచ్చి మిగతా సగం యీ హోటలు యజమాని దగ్గర దాస్తాడు.

అలా డబ్బుదాచి రెండు మూడు వందలయ్యాక తల్లి తను కలసి చిన్న హోటలు నడపాలని వాడి ఆశయం, అప్పుడే అలా దాచింది నూటఏభై రూపాయల పైన అయింది.

అంతా విన్నాక పీరిగాడ్ని మనసులో మెచ్చుకోకుండా వుండలేక పోయాడు వెంకట్రావు. యింత చిన్న వయసులో ఎంత బరువు బుజాన వేసుకున్నాడు!

ముంజేతి షర్టుతో కళ్ళుతుడుచుకుంటూ దీనంగా బాల్చీ పట్టుకుని వెడుతున్న పీరిగాడ్ని చూస్తే జాలనిపించింది.

"అడగో మీ బస్సు వచ్చింది బాబూ, బేగెల్లండి:" ఏవరో అన్నారు. వెంకట్రావు ఆలోచనలోంచి లేచి పరిగెట్టాడు.

* * *

చాలా రోజుల తర్వాత ..

అదే బస్టాండులో .... అదే చిపర, అదే ఎండ, అదేఉక్క, చెమట, గలీజుమధ్య బస్సు కోసం యధాప్రకారం ఎదురు చూస్తున్నాడు వెంకట్రావు.

"ఛా... యీ వెధవ ప్రయాణం చేయడం తన వల్లగాదింక! ఆ పొలం కాస్తా ఏదో ధరకి యీ సారి అమ్మిపారేయాలి! యీ బస్సులలో యీ ప్రయాణాలు యింకా తన వల్ల గాదు...." నాలుగో సారి గట్టిగా నిర్ణయించుకున్నాడు .... ఏదో తిండిగింజలొచ్చే పొలం అమ్ముకోడం ఎందుకు అని ఆలోచించాడు ఇన్నాళ్ళు.... కానీ విసుగెత్తి పోతూంది. ఏడాదికి నాలుగు సార్లన్నా వెళ్ళిరావడం: విసుక్కున్నాడు మనసులోనే. కాస్త నీడ జాగాలో నిలబడి రుమాలుతో విసురుకుంటూ అపసోపాలు పడుతున్నాడు.

"బాబూ,.... బాబూగారు,.... డ్రైవరు బాబూ,...." ఓ స్త్రీ ఎవర్నో పిలుస్తూంది.

"ఏటి ముత్యాలమ్మా ?" ఆ డ్రైవరు ఆమెకేసి తిరిగాడు.

"మా యీరిగాడు రావడానికి యింకెన్నాళ్లవుతుంది బాబూ ?...."

ఆమె మొహంలో ఆరాటంతోపాటు దైన్యంకూడా తొంగిచూస్తూంది.

"ఆ డ్రైవరు తలెత్తి వేళ్ళతో లెక్కలుకట్టాడు." ఇప్పుడెక్కడ, యింకా నాలగు నెలలవ్వద్ది.... ఏం, ఏంటి కావాలి ?"

"ఏం నేదు బాబూ,... యిల్లు జరగడం కష్టంగా వుంది. ఆ డెప్పుడొస్తాడా అని రోజులు లెక్కెంటుగుంటూ యీడ్చుకొస్తన్నాను బాబూ...." అదోలా నిస్పృహగా అంది.

వీరిగాడు !... చటుక్కున ఆ పేరు యీ బస్‌స్టాండ్‌లోనే విన్న గుర్తు వచ్చింది వెంకట్రావుకి... వీరిగాడు!...వాడి తల్లా యీమె ? వీరిగాడు ఏమయ్యాడు ? ఎక్కడికి కెళ్లాడు?

వీరిగాడి గురించి తెలుసుకోవాలన్న ఆరాటాన్ని అదుపులో పెట్టుకోలేక ప్రక్క టీ హోటల్లో దూరాడు వెంకట్రావు.

"ఆడా బాబూ,.... జైలు కెళ్ళి కూర్చున్నాడు...." వెంకట్రావు అడిగిన ప్రశ్నకి వెంటనే సమాధానం చెప్పాడు.

వెంకట్రావు ఆశ్చర్యపోయాడు. "జైలుకా.... ఎందుకు ? ఏంచేశాడు....?"

"ఆడి బాబుని సంపేసాడు బాబూ, ఏణ్ణర్ధం అయింది. పోలీసోళ్ళు అడ్ని అదేదో పిల్లలకి వేరే జైలుంటది కదా బాబూ! అక్కడికి పంపారు"-

ఏ దొంగతనమో చేసి వుంటాడనుకున్న వెంకట్రావు ఆమాటకి

నిర్ఘాంతపోయాడు "ఎందుకు చంపాడు? ఎలా చంపాడు?" ఆత్రుతగా అడిగాడు.

హోటలు వాడు వివరంగా చెప్పుకొచ్చాడు.

ఓ రోజు వీరిగాడు వాళ్ళమ్మ కూర్చుని మధ్యాహ్నం తిండి తింటున్నారు. నర్సిగాడు ఆ రోజు రోజుకంటె ఫుల్‌గా త్రాగి తూలు కుంటూ యింటి కొచ్చాడు. త్రాగి, మూడుముక్క లాటలో చిత్తుగా ఓడి పోయాడు. పెళ్ళాం దగ్గర కానీ, కొడుకు దగ్గర కాని డబ్బులంటే గుంజుకొని మళ్ళీ ఆడాలని యింటికి వచ్చాడు. రాగానే ముందు పెళ్లాన్ని అడిగాడు. అది లేదనికోపంగా జవాబిచ్చింది. కొడుకుని అడిగాడు. వీరిగాడూ లేద న్నాడు. అసలే కైపులోవున్న నర్సిగాడికి వాళ్ళిద్దరి జవాబు, ఆ నిర్లక్ష్యమూ కోపం తెప్పించి వుంటుంది. వాళ్లు తింటున్న మూకుడు కాలితో తన్ని ఎగరగొట్టాడు.... నోటికొచ్చినట్టు బండ బూతులు తిడ్తూ వీరిగాడ్ని జుట్టు పట్టుకు లేవదీసి.... "డబ్బులు తేరా నంజకొడకా, డబ్బు లట్టుకురా లేకపోతే సంపేస్తాను...." అంటూ వీరిగాడు జుట్టు పట్టుకుని గుంజి గుంజి వదిలాడు. అసలే ఎర్రగా వున్న నర్సింలు కళ్ళు మరింత ఎర్రబారాయి. ఆ మొహంలో క్రౌర్యం, ఆ కళ్ళలో ఎరుపుచూసి వీరిగాడు బెదిరి "నా కాడ డబ్బులు లేవు ..." అంటూ ఏడవడం మొదలెట్టాడు.

"లేవూ.... ఎందుకు లేవురా యదవా,.... ఎప్పుడూ లేవంటావు. నిజం ఎప్పుడు సెప్పావు.... తేరా.... తీయరా...." అంటూ మళ్ళీ గుంజాడు. వీరిగాడు లేవంటున్న కొద్ది వాడికోపం మరింత ఎక్కు వయింది. కోపం పట్టలేక వీరిగాడి వీపు వంచి ధభీమని గుద్దులు గుద్దాడు. కాలితో తన్నాడు. వీరిగాడి తల్లి చూస్తూ వూరుకోలేక మొగుడితో వచ్చి కలియబడింది. "నంజకొడకా నీకేం బోయేకాలంరా! అడ్డి అలా కొడత న్నావు.... నీ చేతులు విరగా,.... డబ్బు తే తే అంటే ఆ గుంటెదవ ఎక్క

దనించి తెస్తాడు.... వదులు ముండాడిని...." అంటూ ఆడపులిలా కలియ పడి వీరిగాడ్ని వదలించ బోయింది. కైపులో వున్న నర్సిగాడికి కోపంతో వళ్ళు తెలియలేదు.... "పోవే ముండా" అంటూ దాని డొక్కలో బలంగా ఓ తన్ను తన్నాడు.

ఆ దెబ్బకి ఎనిమిది నెలల గర్భంతో వున్న వీరిగాడి తల్లి ఓ వెర్రి కేక పెట్టి కూలిపోయింది మాట పలుకు లేకుండా.... తండ్రి చేతుల్లోంరి, తప్పించుకున్న వీరిగాడు తల్లి మాట పలుకు లేకుండా పడిపోవడం చూసి చచ్చిపోయిందనే అనుకున్నాడు. ఆ సమయంలో వాడికేం అయిందో తెలియదు. వెర్రి ఆవేశంతో ఊగిపోయాడు. ప్రక్కనున్న కర్రలు కొట్టుకునే గొడ్డలి తీసి ఓ రెండు దెబ్బలు నర్సిగాడి నడుంమీద కొట్టాడు.... "మా అమ్మని చంపేస్తావురా యదవా" అంటూ అలా నేల కూలిన నర్సింలు జరిగేదేమిటో తెలుసుకునే లోపలే దెబ్బల మీద దెబ్బలు కొట్టాడు. వీరిగాడు వీరావేశంతో అందిన చోటల్లా గొడ్డలితో కుళ్ళ బొడిచాడు. నర్సిగాడు, మొదటి రెండు మూడు దెబ్బలకే చచ్చాడు. బుర్ర చితికిపోయింది. చేతులు. కాళ్ళు తెగిపడ్డాయి, రక్తం వరదలయింది. యీ గలభాకి యిరుగుపొరుగు చేరి వీరిగాడ్ని పట్టుకుని వాడి చేతిలో గొడ్డలి లాక్కునే వరకు అలా కొడు తూనే వున్నాడు వాడు.

తరువాత జరగాల్సిన భాగోతం అంతా జరిగింది. పోలీసులొచ్చారు వీరిగాడి తల్లిని ఆస్పత్రికి పంపారు. వీరిగాడ్ని అరెస్టు చేశారు వీరిగాడి తల్లికి ఆపరేషన్ చేసి చచ్చిన పిల్లని తీశారు. అదో నెలరోజు లుండి బ్రతికి బయట పడి యింటికి వచ్చింది. వీరిగాడు ఆత్మరక్షణకి, తల్లి ని రక్షించడానికి వళ్ళు తెలియని ఆవేశంలో కోపంలో చేశాడని కోర్టు తీర్మా నించి రెండేళ్ళ శిక్షతో సరిపెట్టారు. వాడ్ని బాల నేరస్థుల జైలుకి పంపారు.

"యీరిగాడు జైలు కెళ్ళి కూచోడం, ఆడి తల్లికి రోగం రావడం పిల్లల్ని పెంచలేక ఆడకూతురు నానా గడ్డి కరుస్తూంది బాబూ. యీరిగాడు

ఎప్పుడొస్తాడా తన కష్టాలెప్పుడు గట్టెక్కుతాయా అని చూస్తూంది ఆడమ్మ. అప్పుడప్పుడు డ్రైవర్లు క్లీనర్లు తలో బేడ, పావలా చేతిలో పెడుతూనే వుంటారు...." హోటలు వాడు అన్నాడు.

"అంత ఇబ్బంది పడకపోతే వీరిగాడు ఇది వరకు దాచిన డబ్బు వాడుకోకూడదూ..." పాత సంగతి గుర్తువచ్చి అన్నాడు వెంకట్రావు.

"ఆడమ్మ, తిండికి లేకపోయినా పస్తుంటదిగాని ఆ డబ్బు ముట్టు కోదు. ఆడు ప్రాణంగా దాచిన ఆ డబ్బు ఖర్చు సేసేస్తే... ఆడొస్తాడు... హోటలు పెడతాడు... అప్పుడింక నాకు నా పిల్లలకి ఏలోటు వుండ దంటుంది" అది. కొడుకు కోసం రోజులు లెక్కపెట్టుకుంటూ గడుపు తూంది అది.

నిజమే! వీరిగాడు వస్తాడు! హోటలు పెడతాడు! తల్లిని సుఖ పెడతాడు! తల్లిని సుఖపెట్టడమే వాడి ధ్యేయం! అదే వాడి గమ్యం! ఆ గమ్యం చేరడానికి దారిలో ఎన్ని అవాంతరాలు వచ్చినా అన్నీ దాటుకుని గమ్యం... చేరతాడు.... సందేహం లేదు.

పదేళ్ళ వీరిగాడితో తన వయసుని పోల్చుకోకుండా వుండలేక పోయాడు ఆ క్షణంలో వెంకట్రావు.

బస్సు వచ్చి, కూర్చున్నాక, బస్సు తన గమ్యంవైపు పరుగులు తీస్తూంటే మనసులో దృఢ నిశ్చయం చేసుకున్నాడు.... "అమ్మని నా కన్న తల్లిని .. మామయ్య ఇంట్లో .... నౌఖరీదానికన్నా కనా కష్టంగా చాకిరీ చేస్తూ దిక్కులేనట్లు పడివున్న అమ్మని వెంటనే తీసుకొచ్చేయాలి.... పెళ్ళాం మాటలకి లోబడి కన్న తల్లిని దూరం చేసుకోడం ఏమిటి?.... ఇన్నాళ్ళు నా బుద్ధి గడ్డితింది...ఇంక ఒక్కక్షణం ఆలస్యం చేయకూడదు..."

బస్సు దుమ్ము రేపుకుంటూ తన గమ్యం చేరడానికి పరుగులు తీస్తూంటే తన నిర్ణయం ఇచ్చిన సంతృప్తితో తృప్తిగా కళ్ళు మూసుకుని వెనక్కి వ్రాలాడు వెంకట్రావు.

(పోలికేక పత్రిక 1970)